రేషన్ షాప్ సీజ్

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేటకు చెందిన మాబుచాన్ (బీబీ) రేషన్ షాపు (85)ను అధికారులు ఆదివారం సాయంత్రం సీజ్ చేశారు. కార్డుదారుల ఫిర్యాదు మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎల్.వరదకిశోర్‌రెడ్డి తన సిబ్బందితో ఆదివారం ఎండీయూ వాహనాన్ని, రేషన్ షాప్‌కు వెళ్లి నిల్వలను పరిశీలించారు. ముందుగా డీలర్‌కు అధికారులు ఫోన్ చేసినా ఆమె వారి మాటను ఖాతరు చేయకుండా షాపు వద్దకు రాలేదు. రేషన్ షాపు ఇంటి యజమాని శేషగిరినాథ్ సమక్షంలో బీగం పగులగొట్టి పరిశీలించారు. పంపిణీ కన్నా 8 క్వింటాళ్ల బియ్యం అదనంగా రేషన్ షాపులో నిల్వ ఉండటంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పామాయిల్, బియ్యం పంపిణీ చేయలేదన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గోపవరం : మండలంలోని చిన్న గోపవరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుల సహకారంతో నెల్లూరు స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి వారు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో డాక్టర్ రాజేంద్రరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడి ప్రభావం కంటి చూపుపై పడుతుందని, ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడు కంటి పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 74 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, యూత్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటలక్షుమ్మ, ఎంపీటీసీ సరస్వతి, వైద్యాధికారి డాక్టర్ నర్మద, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

రాజుపాళెం : మండలంలోని వాసుదేవాపురం గ్రామంలో ఆదివారం పెద్దమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు, యువతులు పెద్దమ్మ, మల్లాలమ్మ, అంకాళమ్మ, గంగమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి జంతుబలులు ఇచ్చారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామస్తులే కాక పెద్దసంఖ్యలో బంధువులు, స్నేహితులు తరలి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

నేడు ఖాదర్‌పల్లెలో వైద్య శిబిరం

చాపాడు: మండలంలోని పల్లవోలు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటలకు సాయంత్రం 4 గంటలకు నిర్వహించే శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చర్చిలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు, విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాఖ్యాన్ని విన్నారు. స్థానిక బొల్లవరంలోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ కె.విజయబాబు క్రీస్తు గొప్పతనాన్ని వివరించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలను నిర్వహించి భక్తిగీతాలను ఆలపించారు. క్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచే వృత్తాంతాన్ని తెలిపే బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకుంది. అలాగే ఎస్‌పీజీ-1,2, 3, గోల్డెన్ జూబ్లి చర్చిలతో పాటు పలు ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఆదివారం ఈస్టర్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఫాతిమా మాత పుణ్యక్షేత్రంలో విచారణ గురువులు రెవ.ఫాదర్ జి.విజయరావు, సీఎస్ఐ చర్చిలో డీనరీ చైర్మన్ బి.జె.సునీల్‌కుమార్, మదర్‌థెరిస్సా చర్చిలో విచారణ గురువులు రెవ.ఫాదర్



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న పాస్టర్

లక్కినేని ఆరోగ్యరాజు ప్రసంగించారు. సుందరయ్యకాలనీలోని బ్లెస్సింగ్ చర్చిలో రెవ. వీరదాసరిభాస్కర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. బెరాక ప్రార్థనామందిరం, హోసన్నా ప్రార్థనా మందిరం, మార్తోమా చర్చి, కొత్తచెరువు గ్రామంలోని పురాతన ప్రార్థనా మందిరం, బాలాయపల్లె, నందిపల్లె చర్చిలలో వేడుకలు నిర్వహించారు. ఆయా చర్చిల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పాస్టర్లు సీమారాణి, బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏస్తుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలన్నారు. ఉదయాన్నే ఎంతో ఉత్సాహంతో యువకులు, పిల్లలు రంగులు చల్లుకున్నారు. చిన్నా, పెద్దా, ఆడ, మగ తారతమ్యాలు లేకుండా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఆవరణలో సాయంత్రం ఆటల పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. అలాగే రాజుపాళెం చర్చి ఆవరణంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

చాపాడు: మండల వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు ఆదివారం ఈస్టర్ సంబరాలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. మండలంలోని చాపాడు, పల్లవోలు, మదూరు, అన్నవరం, చియ్యపాడు, అల్లాడుపల్లె, బద్రిపల్లె, రాజుపాళెం, చిన్నగురువళూరు, మొర్రాయిపల్లె ఇంకా పలు గ్రామాలలో ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని సీఎస్ఐ షాలోమ్ టౌన్ చర్చి, శాంతినగర్ చర్చి, కృష్ణాపురం సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుని వాఖ్యాలను వినిపించారు. కృష్ణాపురం చర్చిలో పాస్టర్ అర్నిష్ రాజ్ ఈస్టర్ విశ్వాసులకు వివరించారు.

జగనన్నే మాభవిష్యత్తు'కు అపూర్వ స్పందన

బ్రహ్మంగారిమఠం : 'జగనన్నే మాభవిష్యత్తు'కు అపూర్వ స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నాగిశెట్టిపల్లె, దిరసవంచ, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటికి జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజుపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత పేద ప్రజల సంక్షేమం కోసం నాలుగేళ్లలో రూ.2లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రతి సంవత్సరం రూ. 50 లక్ష కోట్లు ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చస్తున్నారని చెప్పారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళుతుంటే మానమ్మకం నువ్వే జగన్ అంటున్నారన్నారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండల గ్రామ సచివాలయ కన్వీనర్ కూనపులి రాజానాయుడు, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, నాగిశెట్టిపల్లె సర్పంచ్ అనుమంత్‌రెడ్డి, దిరసవంచ సర్పంచ్ అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



నందిపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

శేష వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు శేష వాహనంపై ఊరేగారు. ఉదయం సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో, ఆభరణలతో అలంకరించి పురవీధుల్లో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన ఆచరించారు.



శేష వాహనంపై ముక్తిరామలింగేశ్వరుడు

పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు : శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రముఖ విద్వాంసులు కీర్తిశేషులు సగబాల పెద్ద జమాలప్ప జీవిత సంగ్రహం గ్రంథాన్ని, కీర్తిశేషులు సగబాల రాజన్న కవి పత్య కవిత సంకలనాలను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు శ్రీశ్రీకళావేదిక కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి ఓఎస్‌డీ డాక్టర్ ప్రభాకర్‌తోపాటు ప్రముఖులు పాల్గొన్నారు

టంగుటూరులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

రాజుపాళెం : ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మండలంలోని టంగుటూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన యువకుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 22 మంది పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మొదటి, రెండవ, మూడు, నాల్గవ, ఐదవ బహుమతులుగా రూ.5 తులాల వెండి, 2 తులాల వెండి, ఒక తులం వెండి, స్టీల్ టిఫెన్, స్టీల్ బాక్స్ అందించారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. రూ.2.25 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. రూ.1.86 కోట్లతో రాచాయపేట నుంచి టి.సంద్రపల్లె రింగ్‌రోడ్డు, రూ.17.50 లక్షలతో టి.సంద్రపల్లెలో విలేజ్ క్లినిక్, రూ.22 లక్షలతో రాచాయపేటలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేద వాడు తన పిల్లలను బడికి పంపించి బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నదే సీఎం జగన్ ఉద్దేశమన్నారు. విద్యా విధానంలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. నూతనంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ఇంటింటికీ వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎరువు మందులు అందించడం చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌కు రెండు కళ్లలాంటివని అన్నారు. ప్రజల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలకు కోటి రూపాయలు ఖర్చు చేసి పక్కా భవనాలను నిర్మించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కె.రమణారెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు సరిత, నాగేంద్ర, ఎంపీటీసీ సరస్వతి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, కొండారెడ్డి, గోవిందరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



టి.సంద్రపల్లె రింగ్‌రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

చిన్నగురువళూరులో 'జగనన్నతోనే మా భవష్యత్తు'

చాపాడు: మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం 'జగనన్నతోనే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎల్లారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ పైలట్ సుబ్బారెడ్డి, గ్రామ వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అనుమతితో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్టిక్కర్లను ఇంటికి అంటించారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా అంకాళమ్మ జాతర

ఖాజీపేట : రాయలసీమలోనే అత్యంత పురాతనమైన అంకాళమ్మ ఆలయాల్లో దుంపల గట్టు ఆలయం ఒకటి. ఈ ఆలయ జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవం శుక్రవారంతో మొదలై ఆదివారంతో ముగిసింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. మండలంలోని భక్తులు అమ్మవారికి బోనాలతో నైవెద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్టీఎఫ్ ప్రొద్దుటూరు మండల శాఖ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం ఎస్టీఎఫ్ ప్రొద్దుటూరు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ ప్రొద్దుటూరు మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టీఎఫ్ మండల అధ్యక్షుడుగా కావడి కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా పాతకుంట వెంకటసుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా నీలం ఈశ్వరయ్యలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రామసుభాష్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నవరత్నాలు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకాలు దాదాపు ప్రతి ఇంటికీ అందాయని పౌర సరఫరాల సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ జి.సుందర్‌రామిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులోని సుమిత్రానగర్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సరిటాల మౌళాలి, తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్ : వ్యాపారికి కరపత్రం అందజేస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి

అట్లూరు : అట్లూరు సచివాలయ పరిధి వరికుంట పంచాయతీలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తలుపులకు జగనన్న ఫొటోను అతికించి ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, వరికుంట సర్పంచు రమణయ్య, మండల నాయకులు పోతిరెడ్డి రెడ్డెయ్య, ఓబుల్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తరఫున పోటీకి సిద్ధం

ప్రొద్దుటూరు క్రైం : వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండేళ్లకు పైగా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చానన్నారు. అయితే కార్యకర్తలు, మిత్రుల ఒత్తిడి మేరకు ఇక నుంచి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును కలువనున్నట్లు వరద అన్నారు. ప్రస్తుతం ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పని చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని పేర్కొన్నారు. తాను టికెట్ రేసులో ఉన్నట్లు వరద తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



మున్సిపాలిటీ అభివృద్ధిలో బంగారు రెడ్డి కీలక పాత్ర

- ప్రజలతో మమేకమయ్యే మంచి మనిషి బంగారు రెడ్డి
- ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధే లక్ష్యం



కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు తో మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : వందేళ్లకుపైగా చరిత్ర గల ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డికి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అండగా ఉంటూ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఎమ్మెల్యేకు స్వతహాగా బావమరిది, మున్సిపల్ వైస్ చైర్మన్ స్థాయిలో ఉన్నా అత్యంత సాదాసీదాగా ఉంటూ అందరిని కలుపుకొని పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. వినూత్న ఆలోచనలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఆర్ట్స్ కాలేజి నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలను తొలగించి పూర్తి విశాలంగా రోడ్డును నిర్మించారు. అదే తరహాలో గీతాశ్రమం రోడ్డు ఎంట్రన్స్ వద్ద, శ్రీనివాసనగర్, వైఎంఆర్ కాలనీల ఎంట్రన్స్‌ల వద్ద ఆక్రమణలను తొలగింపజేశారు. శివాలయం ఎదురుగా, హోమస్ పేట ఎదురుగా, పద్మశాలీయ కల్యాణ మండపం వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మార్చి మరో చోట ఏర్పాటు చేయించేలా బంగారు రెడ్డి కృషి చేశారు. కేవలం రెండు నెలల్లో తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను నిర్మించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. ఎప్పటి నుంచో పట్టణంలో ఉన్న డ్రైనేజీ కాలువల్లో చెత్తను తొలగించాలని ఆలోచన రావడంతోపాటు అందుకు అవసరమైన రూ.50లక్షలు విలువైన జేసీబీని కొనుగోలు చేశారు. ఈ ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా పుట్టపర్తి సర్కిల్‌లో 100 అడుగుల స్తూపాన్ని ఏర్పాటు చేసి జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డిచే ఆవిష్కరింపజేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో నూతనంగా డివైడర్లను నిర్మించి మధ్యలో మొక్కలను నాటారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి రోడ్డును విస్తరించి ప్రస్తుతం డివైడర్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకును ఏర్పాటు చేసి మున్సిపల్ ఆదాయానికి కృషి చేశారు. గాంధీ, రామేశ్వరం పార్కుల నిర్మాణంలో ఆయన ముఖ్య భూమిక పోషించారు.